సాక్షి
వికారాబాద్
శనివారం, 14, జనవరి, 2023



ఊరూ వాడా బోనాలు

పెద్దేముల్ మండల పరిధిలోని ఇందూరులో, పూడురు మండలంలో గ్రామ దేవతలకు బోనాలు ఘనంగా నిర్వహించారు. 8లో▸



వికారాబాద్ పట్టణంలోని పతంగుల దుకాణాల వద్ద కొనుగోళ్ల సందడి

న్యూస్‌రీల్

గ్రూప్ -2, 4కు ఉచిత శిక్షణ

వికారాబాద్ అర్బన్: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు గ్రూప్- 2,-4 ఉద్యోగాల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసుకున్న ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ మూడు నెలల పాటు ఇవ్వనున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన అధ్యాపకులతో శిక్షణ, మధ్యాహ్న భోజనవసతి, ఉచిత స్టడీ మెటీరియల్ ఇస్తారన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ ప్రారంభమయ్యే తేదీలను తరువాత ప్రకటిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 95738 59268ను సంప్రదించాలన్నారు.

కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

వికారాబాద్ అర్బన్: ఆయా రంగాల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2021-22 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వారి ప్రతిభ ఆధారంగా అందిస్తామన్నారు. అర్హులైన వారు వచ్చే నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్, అగ్రికల్చర్, బీఎస్సీ వెటర్నరీ, ఈసీఏ, ఎంసీఏ, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ వంటి చదువులు చదువుతున్న కార్మికుల పిల్లలకు రూ.వెయ్యి నుంచి రూ. 2 వేల వరకు ఉపకారవేతనాలు ఇస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

జిప్సం ఫ్యాక్టరీకి నోటీసులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి శివారులో ఉన్న రాజరాజేశ్వర కెమికల్ జిప్సం ఫ్యాక్టరీకి నోటీసులు అందజేసినట్లు సర్పంచ్ రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెమికల్ ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన రావడంతో గ్రామస్తులందరూ కలిసి గ్రామ పంచాయతీ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఫ్యాక్టరీ మూసివేసేవరకు పోరాడుతామన్నారు.

చైనా మాంజాపై టాస్క్‌ఫోర్స్ దాడులు

అనంతగిరి: నిషేధిత చైనా మాంజాను అమ్ముతున్న దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం రూ. 2,97,500 విలువైన చైనా మాంజాను పట్టుకున్నామన్నారు. వికారాబాద్ పీఎస్ పరిధిలో 81 డబ్బాలు, కొడంగల్ పీఎస్ పరిధిలో 38 డబ్బాల చైనా మాంజాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో ఎవరైనా నిషేధిత మాంజాను అమ్మితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

పరిగి: రంగాపూర్‌లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి పీర్‌మహ్మద్ డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనంబర్ 89లోని 9ఎకరాల 39గుంటల భూమి రియల్టర్లు కబ్జా చేశారన్నారు. భూమిని స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలన్నారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.



బొంరాస్‌పేట: ముగ్గులు వేస్తున్న మహిళలు



వికారాబాద్ పట్టణంలో రంగుల కొనుగోళ్లు

ముగ్గుల సింగిడి.. పతంగుల సందడి

పల్లెలు, పట్టణాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. మూడు రోజుల ముచ్చటైన పండుగకు వలస జీవులు తిరిగిరావడంతో కోలాహలంగా మారాయి. ఇళ్లల్లో పిండి వంటలతో మహిళలు బిజీగా ఉన్నారు. రంగుల ముగ్గులు, పతంగుల కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిటలాడాయి. రకరకాల కైట్స్‌ను పిల్లలు, పెద్దలు కొనుగోలు చేస్తున్నారు. నేడు భోగి, రేపు సంక్రాంతి, ఎల్లుండి కనుమ పండుగలను జరుపుకోనున్నారు. - అనంతగిరి

రియల్టర్ల ఆగడాలు

యథేచ్ఛగా భూ ఆక్రమణలు

- అడ్డువచ్చిన రైతులపై దాడులు
- చేసేదిలేక రోడ్డెక్కిన అన్నదాతలు
- రహదారిపై భైఠాయింపు
- నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్





మోత్కూరు గేట్ సమీపంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, (ఇన్‌సెట్‌లో) రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ

దోమ: రియల్టర్లు బరితెగిస్తున్నారు. గ్రామాల్లో పేద రైతులను టార్గెట్ చేసి గూండాయిజం చేస్తున్నారు. భూములు తమవంటూ దాడులకు తెగబడుతున్నారు. దీంతో అన్నదాతలు రోడ్డెక్కారు. మా భూములను కాపాడాలంటూ ప్రధాన రహదారిపై ఆందోళనకు దిగారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేదిలేదని భీష్మించి కూర్చున్నారు. గంటకు పైగా రోడ్డుపై భైఠాయించడంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. దోమ మండల పరిధిలోని మోత్కూరులో చోటుచేసుకున్న ఈఘటన వివరాలిలా ఉన్నాయి. మోత్కూరులో సర్వే నంబర్ 548లో గ్రామానికి చెందిన రైతులకు 20 ఎకరాల 29 గుంటల భూమి ఉంది. ఆ భూమిలో అదే గ్రామానికి చెందిన సంపల్లి ఆంజనేయులుకు 4 ఎకరాల 21 గుంట భూమి ఉండగా, ఆ భూమిని ఆనుకుని మహమ్మద్ అయేషా ఫాతిమా అనే మహిళకు ఎకరం 28 గుంటల భూమి ఉంది. ఆ భూమిని ఉదయభాను అనే ఓ రియల్టర్ ఫాతిమా నుంచి కొనుగోలు చేసి అగ్రిమెంట్ చేసుకున్నారు. కొనుగోలు చేసిన పొలం చుట్టూ కడీల ఏర్పాటుకు వచ్చారు.

పక్క పొలంలోనూ పాగాకు యత్నం..

పక్కనే ఉన్న సంపల్లి ఆంజనేయులు పొలంలో కూడా సర్వే చేస్తుండగా సదరు రైతుతో పాటు వారి కుటుంబ సభ్యులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సర్వే ఎలా చేస్తారని అడ్డుకున్నారు. దీంతో సర్వే చేయిస్తున్న రియల్టర్ తన కిరాయి గూండాలతో దాడులకు పాల్పడ్డాడు. ఈ విషయమై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు ఆయా పార్టీల నేతలు, గ్రామ రైతులు కలిసి శుక్రవారం పరిగి- మహబూబ్‌నగర్ ప్రధానరోడ్డుపై ధర్నాకు దిగారు. దాడులకు పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని ఆందోళనల చేపట్టారు. స్థానిక ఎస్ఐ విశ్వజన్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులపై దాడికి పాల్పడ్డ వ్యక్తులను అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పరిగి సీఐ వెంకటరామయ్య పరిగి, కుల్కచర్ల ఎస్ఐలతో పాటు ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బందితో ఘటన స్థలానికి వచ్చారు. రైతులతో మాట్లాడి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

గంటకుపైగా ట్రాఫిక్ జామ్

రైతులు, గ్రామస్తుల ఆందోళనతో పరిగి- మహబూబ్‌నగర్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించిపోయాయి. ఎట్టకేలకు రైతులు ఆందోళన విరమించడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

పట్నం వెళ్లేదెలా?

- హైదరాబాద్‌కు బస్సుల కుదింపు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు
- ప్రైవేటుకు పెరుగుతున్న ఆదరణ
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



అధికారులు రద్దు చేసిన సింగిల్ స్టాప్ బస్సు

కొడంగల్ : నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్ వెళ్లడానికి ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులను తగ్గించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రయాణికులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతోంది. కొడంగల్ మీదుగా నిత్యం పరిగి, నారాయణపేట, హైదరాబాద్, కోస్గి డిపోలతో కర్నాటక రాష్ట్రానికి చెందిన బస్సులు తిరుగుతున్నాయి. గతం నుంచి ఇప్పటి వరకు ప్రధానంగా పరిగి డిపో బస్సులపైనే ఈ ప్రాంత ప్రజలు ఆధారపడి ప్రయాణం సాగిస్తున్నారు. ఈ మధ్య కాలంలో నారాయణపేట డిపో అధికారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అయిదు బస్సులను హైదరాబాద్‌కు తిప్పుతున్నారు. పరిగి డిపో అధికారులు ప్రతి అరగంటకు ఓ బస్సును నడిపేవారు. ఇప్పుడు గంటకు పైగా ఎదురుచూసినా బస్సులు వచ్చే పరిస్థితి లేదని ప్రయాణికులు వాపోతున్నారు. కలెక్షన్ టార్గెట్ కోసం బస్సులను తగ్గించినట్లు అధికారిక సమాచారం. ఆర్టీసీ తన సేవా మార్గాన్ని పక్కన పెట్టి కలెక్షన్ మీద దృష్టి పెట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. గతంలో అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్ నుంచి హైదరాబాద్‌కు సింగల్ స్టాప్ బస్సును ప్రారంభించారు. దాన్ని కూడా ఆర్టీసీ అధికారులు రద్దు చేసి వారి నిర్వాకాన్ని చాటుకున్నారు.

వికారాబాద్ వెళ్లేందుకూ తిప్పలే..

కొడంగల్ నుంచి వికారాబాద్ జిల్లా కేంద్రానికి ఒక్క బస్సు కూడా లేదంటే ఆర్టీసీ అధికారులు బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల ప్రజలు వికారాబాద్ వెళ్లాలంటే రెండు బస్సులు ఎక్కి దిగాల్సిందే. పరిపాలన సౌలభ్యం కోసం చిన్న జిల్లాల ఏర్పాటు జరిగింది. అయితే వికారాబాద్ జిల్లా ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు కొడంగల్ నుంచి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదు. తేది.01.07.2017న అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి కొడంగల్ నుంచి జిల్లా కేంద్రానికి పల్లె వెలుగు బస్సును ప్రారంభించారు. వారం రోజులు తిరగక ముందే బస్సును రద్దు చేశారు. ఈ ప్రాంత ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్టీసీ అధికారులు స్పందించడంలేదు.

‘కంటి వెలుగు’కు ఏర్పాట్లు చేయండి

- శిబిరాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- అధికారులకు కలెక్టర్ నిఖిల ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నిఖిల

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నిఖిల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన వారికి రీడింగ్ గ్లాసులతో పాటు ప్రిస్క్రిప్షన్ అద్దాలను రెండు వారాల్లో అందించాలన్నారు. ఇతర కంటి సమస్యలకు తాండూరు లోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేసి అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. జిల్లాలోని అన్ని మున్సిపల్ వార్డుల్లో, గ్రామ పంచాయతీల్లో కంటి వెలుగు శిబిరాలను విజయవంతం చేయాలన్నారు. శిబిరాల వద్ద అవసరమైన కుర్చీలు, టేబుల్స్, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. క్యాంపులు నిర్వహించే సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. కంటి పరీక్ష కేంద్రాలకు రోజుకు 200 మంది వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో 8మందితో కూడిన వైద్య బృందం ఉదయం 9 నుంచి 5గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా వైద్యాధికారి డాక్టర్ పాల్వాన్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి అశోక్ కుమార్, జెడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్, డీపీఓ పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డలకు అండ

- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో భరోసా
- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీలో మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: పేదింటి ఆడబిడ్డలకు కేసీఆర్ మేనమామలా కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌తో అండగా నిలుస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశ హాలులో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తోందని తెలిపారు. మహిళల కష్టాలు తీర్చేందుకు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటిని అందిస్తున్నారని గుర్తు చేశారు. కల్యాణలక్ష్మికి దరఖాస్తు చేస్తే చాలు ఎవరి ప్రమేయం, పైరవీ లేకుండా సాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కొరపోలు రఘుమారెడ్డి, వైస్ ఎంపీపీ సునితా అంధ్యానాయక్, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, ఉపతహసీల్దార్ నవత, ఆర్ఐలు పావని, స్వర్ణకుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.ఆనందం, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అదిల్ అలీ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అయ్యో.. పాపం

బాలింతల మృత్యుఘోష!

- మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రసవం ...ఇద్దరు బాలింతలకు సీరియస్
- హుటాహుటిన గాంధీకి తరలింపు... చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
- వైద్యుల నిర్లక్ష్యం వల్లేనని బంధువుల ఆరోపణ



మృతురాలు సిరివెన్నెల | సిరివెన్నెలకు పుట్టిన పాప



మృతురాలు శివాని | శివానికి పుట్టిన మగబిడ్డ

సాక్షి, సిటీబ్యూరో/మలక్‌పేట్/గాంధీ ఆస్పత్రి: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ చికిత్సలు వికటించి నలుగురు మహిళలు మృతి చెందిన అంశాన్ని ఇంకా పూర్తిగా మరిచిపోక ముందే..తాజాగా గురువారం రాత్రి మలక్‌పేట ఏరియా ఆస్పత్రిలో ప్రసవించిన ఇద్దరు మహిళలు మృత్యువాత పడ్డారు. కేవలం గంట వ్యవధిలోనే ఆ ఇద్దరు తల్లులు కన్నుమూయడం విషాదం నింపింది. సిజేరియన్‌కు ముందు గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేయకపోవడం, వైద్య పరీక్షలు నిర్వహించకపోవడం, సిజేరియన్ చేసిన ప్రదేశాన్ని సరిగా శుభ్రం చేయకుండానే కుట్లు వేయడం వల్లే మృతిచెందారని బంధువులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగారు. పోస్టుమార్టం రిపోర్ట్ ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని టీవీవీపీ కమిషనర్ హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. అయితే ఈ మొత్తాన్ని తీసుకునేందుకు కుటుంబ సభ్యులు నిరాకరించారు. ఇదిలా ఉంటే శుక్రవారం ఉదయం డీఎంఈ రమేష్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటిలు గాంధీకి చేరుకుని సూపరిటెండెంట్ రాజారావు సహా, గైనకాలజీ వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమై బాలింతల మృతికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు.

రెండో కాన్పుకోసం వచ్చిన సిరివెన్నెల..

నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామానికి చెందిన పోలే మహేష్ భార్య సిరివెన్నెల (25) రెండో కాన్పు కోసం సోమవారం ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ఆమెకు బుధవారం సిజేరియన్ చేశారు. ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత కొద్ది సేపటికే పల్స్ రేట్ ఒక్కసారిగా పడిపోయింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అత్యవసర వైద్య సేవల పేరుతో వైద్యులు ఆమెను గాంధీకి తరలించారు. 2డీ ఎకో పరీక్ష సహా ఇతర వైద్య పరీక్షలు చేశారు. గురువారం రాత్రి పది గంటలకు మరణించింది. అయితే ఆమె గత ఐదు రోజులుగా డెంగీ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రి వైద్యులు ఈ విషయాన్ని గుర్తించకుండా ఆమెకు సిజేరియన్ చేయడం, ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోవడానికి కారణమయ్యారని మృతురాలి భర్త మహేష్ ఆరోపించారు. వీరికి ఏడాదిన్నర పాప కూడా ఉంది. ఆ పాప గుక్కపట్టి ఏడుస్తుండగా...అప్పుడే పుట్టిన శిశువు కనీసం ముర్రుపాలకు కూడా నోచుకోలేదని బంధువులు విలపించారు.

తొలి కాన్పు కోసం వచ్చిన శివాని

సైదాబాద్ పూసలబస్తీకి చెందిన రవీందర్, వెంకటలక్ష్మి కుమార్తె శివాని(25) మొదటి కాన్పు కోసం కుటుంబ సభ్యులు ఆమెను ఈనెల 10 తేదీన ఏరియా ఆసుపత్రిలో చేర్పించగా.. వైద్యులు బుధవారం ఉదయం సిజేరియన్ చేశారు. మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఆమె అకస్మాత్తుగా విరేచనాలతో బాధపడింది. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. అయితే బాలింత మరణానికి థైరాయిడ్ కారణమని వైద్యులు చెబుతుండగా, సిజేరియన్ తర్వాత కుట్లు వేసే సమయంలో సరిగా శుభ్రం చేయక పోవడం వల్లే తన భార్య చనిపోయిందని, ఆరోగ్యంగా ఉన్న తన భార్య మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె భర్త జగదీష్‌కుమార్ ఆరోపించారు.

ఆందోళనలు..ఆర్తనాదాలు

గురువారం రాత్రి గంట వ్యవధిలో ఇద్దరు బాలింతలు మృతి చెందడంతో అప్పటికే ఆస్పత్రిలో చేరిన గర్భిణులు, బాలింతలు, వారి బంధువులు ఉలిక్కిపడ్డారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే రెండు నిండు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చిందని మృతుల బంధువులు ఆరోపించారు. కారణమైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 9 గంటలకు మలక్‌పేట్ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఆందోళనకు దిగారు. బాధితుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు భారీగా అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. శిశువులను నిలోఫర్ ఆస్పత్రికి తరలించేందుకు వాహనం సమకూర్చినా తీసుకెళ్లేందుకు నిరాకరించారు. శిశువులను చూపిస్తూ కన్నీరుమున్నీరుగా విలపించారు. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ నాయకులు బాధిత కుటుంబాలకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఇదే సమయంలో స్థానిక ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆసుపత్రిలో ఆందోళన చేస్తున్న బాధితులను పరామర్శించారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

నిమ్స్‌కు మరో ఎనిమిది మంది బాలింతలు

మలక్‌పేట్ ఏరియా హాస్పిటల్‌లో ఇద్దరు బాలింతల మృతితో వైద్యారోగ్యశాఖ అలర్ట్ అయింది. ఏ ఒక్కరికి ఇబ్బంది కాకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. దానికి గల కారణాలపై ఆరా తీసింది. మొత్తం 10 మందికి సిజేరియన్లు జరగ్గా ఇందులో ఇద్దరు మృతి చెందారని, మెరుగైన వైద్యం కోసం మిగతా 8 మంది బాలింతలను నిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ 8 మంది బాలింతల ఆరోగ్యం నిలకడగానే ఉందని, కేవలం అబ్జర్వేషన్ కోసం మాత్రమే నిమ్స్‌కు తరలించారని నిమ్స్ వైద్యులు వెల్లడించారు.





ఏరియా ఆసుపత్రి ఆవరణలో బంధువుల రోదనలు

చర్యలు తీసుకుంటాం

ఈ ఘటనపై నిపుణుల కమిటీతో విచారణ చేయిస్తాం. కుటుంబ సభ్యుల ఆరోపణల నేపథ్యంలో విచారణ చేసి చర్యలు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రిలో 11 మంది డెలివరీ కాగా వీరిద్దరూ మినహా మిగతా వారంతా ఆరోగ్యంగా ఉన్నారు.

– టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా

ఇద్దరు బాలింతలు పేద కుటుంబాలకు చెందిన వారు. గాంధీ ఆసుపత్రిలో వేర్వేరు కారణాలతో చనిపోయారు. ఎమ్మెల్యే బలాల కలెక్టర్‌తో మాట్లాడారు. బాధిత కుటుంబానికి ఆదుకోవడానికి రూ.5 లక్షలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ.4 లక్షలు, కలెక్టర్ ఫండ్ నుంచి రూ.1 లక్ష మొత్తం రూ.5 లక్షలు బాధిత కుటుంబాలకు అందజేస్తాం. – ఆర్డీవో వెంకటేశ్వర్లు

అధ్యయనం చేస్తున్నాం

ఇద్దరు బాలింతల మరణాలకు గల కారణాలపై అధ్యయనం చేస్తున్నాం. సిరివెన్నెల, శివానిలను గురువారం రాత్రి గాంధీకి తీసుకురాగా ఐసీయులో చేర్పించి వైద్యపరీక్షలు చేశాం. చికిత్స పొందుతూ అర్ధరాత్రి తర్వాత ఇరువురు మృతి చెందారు. మృతుల హెల్త్ రిపోర్ట్, మలక్‌పేట ఆస్పత్రిలో అందించిన వైద్యం, పోస్టుమార్టం నివేదిక తదితర అంశాలను క్రోడీకరించి పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తాం.

– డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ

క్లుప్తంగా

బైక్‌ అదుపుతప్పి..

- మహిళ మృతి
- ఇద్దరు చిన్నారులకు గాయాలు



మంగమ్మ మృతదేహం

మర్పల్లి: బైక్‌ అదుపుతప్పి ఓ మహిళ మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మర్పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన మోత్కుపల్లి అంజయ్యకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు కిష్టయ్య సంక్రాంతి సందర్భంగా భార్య మంగమ్మ(30), పిల్లలు కావ్యశ్రీ, హరిశంకర్‌తో కలిసి సంగారెడ్డి జిల్లా చరాక్‌పల్లి మండలం సత్వార్‌ గ్రామంలోకి అత్తగారింటికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అతివేగంగా వెళ్తున్న బైక్‌ మర్పల్లి రైల్వే స్టేషన్‌ ఎదుట విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న వేప చెట్టుకు ఢీకొట్టాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఓ క్షతగాత్రులను మర్పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మంగమ్మ తలకు బలమైన గాయమవ్వడంతో అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మెరుగైన వైద్యం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రికి రిఫర్‌ చేశారు. మృతురాలి మామ అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు.

మేక పిల్లలపై కుక్కల దాడి

13 జీవాలు మృత్యువాత



మృత్యువాత పడిన మేక పిల్లలు

పెద్దేముల్‌: కుక్కల దాడిలో 13 మేక పిల్లలు మృత్యువాతపడ్డాయి. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని మంబాపూర్‌ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు ఆశప్ప తెలిపిన ప్రకారం.. రోజు మాదిరిగానే జీవాలను మేతకు వదిలాడు. చిన్న పిల్లలను పాకలోనే ఉంచాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు మేక పిల్లలపై దాడి చేయడంతో 13 జీవాలు మృత్యువాత పడ్డాయని తెలిపాడు. సుమారు రూ.40వేలకు పైగా నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE AT SEDAM
O.S. No.26/2019
Mallreddy and others Vs Bhimreddy and others
Suit: For Partition and separate Possession

To,
11. Narsamma W/o Mohanreddy **Chintamola** Age: 42 Years Occ: Agriculture R/o Lachnapuram Mandal Tandur Dist: Vikarabad.
12. Sushilamma W/o Ramreddy **Malipatil** (Parvatreddblla Illu) Age: 40 Years Occ: Agriculture R/o Narsapuram Mandal Damargidda Dist: Narayanpet.

Suit for Partition and Separate Possession

Where as Mallreddy S/o Vishwanathreddy @ Bhimreddy Age: 48 years R/o Kaklawar Tq: Gurumitkal Dist: Yadgir and his brother have filed this suit against Bhimreddy S/o Gurunath reddy Age: about 65 Years R/o Shaklatpalli Tq: Sedam Dist: Kalaburagi and others in respect of joint family properties for partition and Separate possession wherein you are Defendant No.11 and 12. Therefore you are hereby summoned to appear in this court on 27/2/23 At 11 A.M. either in person or by an Advocate duly instructed and to file written statement if any.
Take notice that in default of your appearance on the day mentioned above the matter will be decided in your absence.
Given under my hand and the seal of the court on this the 13th day of January 2023.

Sd/- **Civil Clerk** Sd/- **Chief Ministerial Officer**
Sd/- **R. Narayan Reddy**
Advocate For Plaintiffs.

హనుమాన్‌ ఆలయంలో ఆభరణాల చోరీ



కేశంపేట: హనుమాన్‌ అలంకరణ ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని లేమామిడి గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. లేమామిడి గ్రామ శివారులో ఆంజనేయ స్వామి ఆలయం నిర్మాణంలో ఉంది. ఈ ఆలయంలో ప్రతీ మంగళ, శనివారం గ్రామానికి చెందిన మఠం శ్రీశైలం పూజలు నిర్వహిస్తుంటాడు. శుక్రవారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన బాల్‌రెడ్డి పూజల నిమిత్తం ఆలయానికి వెళ్లాడు. ఆలయం తాళం విరగొట్టి ఉన్నట్టు గుర్తించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గ్రామస్తులు గుడికి వచ్చి పరిశీలించగా హనుమంతి వెండి తాపడం ఆభరణాలు దొంగిలించినట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.30వేలు ఉంటుందని సర్పంచ్‌ శ్రీశైలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధనుంజయ్‌ తెలిపారు.

ఊరూ.. వాడా.. బోనాల సందడి

- ఇందూరులో ఊరడమ్మకు.. • మన్నెగూడలో మైసమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు



పెద్దేముల్‌: ఊరడమ్మ తల్లి



పోతురాజుల నృత్యం

పెద్దేముల్‌: మండల పరిధిలోని ఇందూరులో మూడు రోజులపాటు ఊరడమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలు శుక్రవారం అమ్మవారికి బోనాలు సమర్పించడంతో ముగిసాయి. ఇంటింటికి బోనమెత్తి మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణల అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఒగ్గు డోలు కళాకారుల డప్పు చప్పుళ్లు, పోతురాజుల నృత్యాల నడుమ ఊరేగింపు కొనసాగింది. అమ్మవారి అలయం వద్ద భవిష్యవాణి వినిపించారు. ప్రతీ మూడేళ్లకు ఒకసారి జాతర ఉత్సవాలు నిర్వహించాలని రంగంలో చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు.

బోనమెత్తిన మహిళలు

పూడూరు: మండల పరిధిలోని మన్నెగూడలో శుక్రవారం మైసమ్మతల్లికి బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకల నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. మహిళలు బోనమెత్తి ఊరేగింపు అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ వినోద్‌గౌడ్‌, నాయకులు బాలమణి, అశోక్‌గౌడ్‌, దయానంద్‌గౌడ్‌, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: మన్నెగూడలో మైసమ్మతల్లి బోనాల ఉత్సవాలు

కంటి పరీక్ష చేయించుకోండి

'మీతోనేను'లో ఎమ్మెల్యే డాక్టర్‌ ఆనంద్‌



ధారూరు: కొండాపూర్‌కలాన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆనంద్‌

ధారూరు: ఈ నెల 18 నుంచి జూన్‌ 8 వరకు నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ ఎమ్మెల్యే డాక్టర్‌ మెతుకు ఆనంద్‌ ప్రజలకు సూచించారు. కొండాపూర్‌కలాన్‌ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన మీతోనేను కార్యక్రమంలోలో ఆయన ప్రసంగించారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు మార్చి 9 నుంచి 13 వరకు కొండాపూర్‌కలాన్‌లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. పల్లె ప్రగతిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి, స్వచ్ఛ గ్రామంగా తీర్చి దిద్దాలని స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పారు. పాడుబడిన బావులపై పైకప్పులు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చివేయాలని ఆదేశించారు. అనంతరం మండల పరిధిలోని ధర్మాపూర్‌ గ్రామంలో రూ.10లక్షల నిధులతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పరమేశ్‌, వీరేశం, బోడ అనిల్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు రాజునాయక్‌, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ సంతోశ్‌, అంజయ్య, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు వెంకటయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్‌ కావలి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఖేల్‌ ఇండియా'కు గురుకుల విద్యార్థి

ఆటలతో పాటు చదవులోనూ ప్రతిభ చూపుతున్న సాయికిరణ్‌



కోచ్‌ మహిపాల్‌తో సాయికిరణ్‌

కొడంగల్‌ రూరల్‌: మండల పరిధిలోని హస్నాబాద్‌ గ్రామానికి చెందిన, మహాత్మా జ్యోతిబా పూలే వికారాబాద్‌(మంబాపూర్‌)లో చదువుతున్న విద్యార్థి సాయికిరణ్‌ ఖేల్‌ ఇండియా పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 8 వరకు మధ్యప్రదేశ్‌(భూపాల్‌)లో నిర్వహించనున్న ఖేల్‌ ఇండియా పోటీల్లో పాల్గొననున్నాడు. షాట్‌పుట్‌ విభాగంలో రాష్ట్ర, జాతీయ, ఇంటర్నేషనల్‌ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతూ ఖేల్‌ ఇండియా పోటీల్లో చోటు సంపాదించాడు. ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈయన పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించాడు. ఇంటర్‌ మొదటి సంవత్సరం ఫలితాల్లో 95శాతంతో ఉత్తీర్ణత సాధించాడు. ఇప్పటి వరకు సాయికిరణ్‌ 15రాష్ట్ర స్థాయి, 9జాతీయ స్థాయి, ఒక ఇంటర్నేషనల్‌ పోటీల్లో సత్తాచాటాడు. జాతీయ స్థాయి(స్టూడెంట్‌ ఒలంపిక్స్‌) అస్సాంలో నిర్వహించిన పోటీల్లో గోల్డ్‌ మెడల్‌, సౌత్‌ జోన్‌ జాతీయ స్థాయి(కేరళ)లో సిల్వర్‌ మెడల్‌, అండర్‌ 16 జాతీయ స్థాయిలో సిల్వర్‌ మెడల్‌, ఆంధ్రప్రదేశ్‌ అండర్‌18 జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి ఖేల్‌ ఇండియా పోటీలకు ఎంపికయ్యాడని కోచ్‌ మహిపాల్‌ తెలిపారు. ఈ పోటీల్లోనూ ప్రతిభ చాటాలని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల సొసైటీ కార్యదర్శి మల్లయ్యభట్టు, రంగారెడ్డి జిల్లా ఆర్‌సీఓ యాదయ్యగౌడ్‌ ప్రిన్స్‌పాల్‌ రమేశ్‌, ఏటీపీ రాజీవ్‌, కోచ్‌ మహిపాల్‌, ఉపాధ్యాయ సిబ్బంది, హస్నాబాద్‌ గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

ల్యాబ్‌ టెక్నీషియన్‌ బలవన్మరణం



గణేశ్‌ మృతదేహం

అనంతగిరి: ఓ ల్యాబ్‌ టెక్నీషియన్‌ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణంలోని గాంధీ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మంగళి బాబురావు కుమారుడు గణేశ్‌(27) హైదరాబాద్‌లో ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కాగా నాలుగు రోజులుగా అతడు డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. సాయంత్రం ఇంట్లోని పక్క గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కుటుంబీకులకు గణేశ్‌ కనపడకపోవడంతో ఫోన్‌ చేశారు. ఫోన్‌ లిఫ్ట్‌ చేయకపోవడంతో వెతుకుతున్న క్రమంలో పక్కగది గడిపెట్టి ఉంది. అనుమానంతో మృతుడి సోదరి చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగులగొట్టి చూడగా ఉరేసుకుని కనిపించాడు. వెంటనే యువకుడిని కిందకు దింపి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

చైనా మాంజా అమ్మితే కఠిన చర్యలు

చేవెళ్ల: చైనా మాంజ అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఓ దుకాణంలో చైనా మాంజా అమ్ముతున్న ట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం పోలీసులు తనిఖీలు చేపట్టి దుకాణదారుడు ప్రశాంతిరెడ్డిపై కేసు నమోదు చేశారు.

ధనాధన్‌ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ క్రికెట్‌ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

SAKSHI | SAKSHI DIGITAL MEDIA GROUP | SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్‌ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్‌ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్‌ చేయాలని ఉందా? క్రికెట్‌ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్‌ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్‌ లీగ్‌ (ఎస్‌పీఎల్‌) క్రికెట్‌ టోర్నీ నాలుగో సీజన్‌ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్‌..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్‌ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌ రాబిన్‌ లీగ్‌ పద్ధతిలో టైటిల్‌ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్‌ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్‌ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్‌–19 జూనియర్‌ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్‌–25 సీనియర్‌ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్‌ స్థాయిలో ఆడేందుకు జూనియర్‌ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్‌ (ప్లస్‌ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్‌ జట్లకు అర్హత ఉంది. సీనియర్‌ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్‌, ఇంజినీరింగ్‌, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్‌ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్‌) చూపించాలి. మ్యాచ్‌ జరిగే సమయంలో బ్యాటర్స్‌, వికెట్‌ కీపర్‌ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్‌ ప్యాడ్‌లు, అండర్‌ గార్డ్స్‌, హ్యాండ్‌ గ్లౌవ్స్‌, వైట్‌ డ్రెస్‌, వైట్‌ షూస్‌ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్‌ నంబర్లు: **96665 72244**

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బొంపల్లి, శివారెడ్డిపల్లి, బాస్‌పల్లి, మైలారం, మోత్కూర్‌, రాకొండ, తిమ్మాయిపల్లి, ఊటుపల్లి, దొంగ ఎన్కేపల్లి, గూడూర్‌ గ్రామాల బీఆర్‌ఎస్‌ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో విజయానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్‌ ప్రజలకు అందజేస్తున్నారని చెప్పారు. వీటిని ప్రజలకు వివరించాలని చెప్పారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగిరెడ్డి, వైస్‌ ఎంపీపీ మల్లేశం, మండల కో ఆప్షన్‌ సభ్యులు ఖాజాపాష, పీఏసీఎస్‌ చైర్మన్‌ దాతన్నగారి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్‌, పరిగి, దోమ బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్‌, ఆర్‌.ఆంజనేయులు, మండల ప్రధానకార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రచారకార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, యూత్‌ అధ్యక్షుడు మశ్చేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజగోపాలచారి, బొంపల్లి ఎంపీటీసీ సభ్యుడు రాములు, సర్పంచ్‌ సురేశ్‌, ఉపసర్పంచ్‌ రఫీక్‌, ఆయా గ్రామాల బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ల సహకారమే ప్రధానం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌ స్వప్న

తాండూరు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న

తాండూరు: కంటి వెలుగు కార్యక్రమానికి కౌన్సిలర్ల సహకారమే ప్రధానమని తాండూరు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ తాటికొండ స్వప్న అన్నారు. శుక్రవారం ఆమె మున్సిపల్‌ కార్యాలయంలో కౌన్సిలర్లు, వైద్య శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 18 నుంచి ప్రారంభించనున్న కార్యక్రమం వంద రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఒక్కో బృందంలో 8మంది సభ్యులు ఉంటారని చెప్పారు. వార్డుల వారీగా నిర్వహించే ఈ కార్యక్రమానికి కౌన్సిలర్లు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ మేనేజర్‌ నరేందర్‌రెడ్డి, ఫ్లోర్‌ లీడర్లు శోభారాణి, సోమ శేఖర్‌, లలిత, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు రత్నమాల, నీరజారెడ్డి, ప్రభాకర్‌గౌడ్‌, బొంబినా, సాహు శ్రీలత, మమత, మధుబాల, బాలప్ప, అబ్దుల్‌ రజాక్‌, ముక్తార్‌ నాజ్‌, రవి, వెంకన్నగౌడ్‌, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గన్నారు.

కేంద్రం వాటా సరే.. రాష్ట్రానిది ఏదీ?



మాట్లాడుతున్న శ్రీలత

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత

తాండూరు: రేషన్‌ దుకాణాల్లో కేంద్రం అందించే వాటా మాత్రమే సరఫరా చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం అందించే రేషన్‌ వెంటనే సరఫరా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత డిమాండ్‌ చేశారు. శుక్రవారం ఆమె పట్టణంలోని పలు రేషన్‌ దుకాణాలను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. సంక్రాంతి పండగకు పేదలు ఇబ్బంది పడకూడదనే కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ వాటాగా అందించే బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదని డీలర్లను అడిగి తెలుసుకున్నారు. తమకు కేంద్రం వాటా మాత్రమే అందిందని ఇంకా రాష్ట్ర వాటా బియ్యం సరఫరా కాలేదని తెలిపారు. ఈ సందర్భంగా సాహు శ్రీలత మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఇబ్బందు పడకూడదనే కేంద్రం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌ సరుకులను సైతం సక్రమంగా పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. కేంద్రం అందిస్తున్న పథకాలు తమగా చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు.

దళితులపై దాడులు చేస్తే ఊరుకోం

ప్రజా సంఘాల నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పరిగి: దళితులపై దాడులు చేస్తే ఊరుకోమని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించి దళితులపై దాడులు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జిల్లా పరిధిలో నిత్యం ఎక్కడో ఒక దళితులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై దాడులు చేస్తున్న అగ్రకులస్తులు, పెత్తందారులను నిలువరించడంలో ప్రభుత్వాలు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆరోపించారు. దళిత రక్షణ చట్టాలను అబాసు పాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2016 సవరణ పేరుతో ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. పౌర హక్కుల చట్టం, పున్నయ్య కమిషన్‌ సిఫారసులు, జీఓలు అమలు చేయకుండా అధికార యంత్రాంగం నీరుగారుస్తోందని విమర్శించారు. కులాంతర వివాహాల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య, కేవీపీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

1,700 గ్రాముల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకున్న పోలీసులు



గంజాయి విక్రయిస్తూ పట్టుబడిన నిందితులు

ఇబ్రహీంపట్నం రూరల్‌: గుట్టు చప్పుడుకాకుండా గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. ఆదిబట్ల సీఐ రవికుమార్‌ తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం తుని రావిచెట్టు వీధికి చెందిన న్యాకంటి చరణ్‌కుమార్‌ (35), కర్మాన్‌ఘాట్‌ ప్రాంతానికి చెందిన కంచ నరేశ్‌ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాడేరు నుంచి గంజాయి తీసుకువచ్చి కుర్మల్‌గూడ సమీపంలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో స్కూటీలో పెట్టుకుని విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఆదిబట్ల పోలీసులు దాడి చేసి వారి వద్ద 1,700 గ్రాముల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.